ప్రజాశక్తి

ఆదివారం 8 జూన్ 2025

5

పార్వతీపురం మన్యం



ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాల్లో జిల్లా సెకెండ్

ప్రజాశక్తి పార్వతీపురంరూరల్

ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు శనివారం విడుదలైన ఫలితాల్లో పార్వతీపురం మన్యం జిల్లా రెండో స్థానంలో నిలిచిందని డిఐఇఒ వై.నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లాలో 1,250 మంది ఫస్టియర్ పరీక్ష రాయగా 922 మంది ఉత్తీర్ణులైనట్టు తెలిపారు. అలాగే సెకండియర్లో 942 మంది పరీక్ష రాయగా 822 మంది ఉత్తీర్ణత సాధించారు. ఫస్టియర్లో 74 శాతం, సెకండియర్లో 87 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలోనే మన్యం జిల్లా రెండో స్థానంలో నిలిచిందని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

వెబ్ కౌన్సిలింగ్‌పై ఉపాధ్యాయుల ఆగ్రహం

- డిఇఒ కార్యాలయం వద్ద ధర్నా
- మాన్యువల్ కౌన్సిలింగ్ నిర్వహించాలని డిమాండ్

ప్రజాశక్తి- పార్వతీపురం

ఎస్‌జిటి ఉపాధ్యాయుల బదిలీలను మాన్యువల్ కౌన్సిలింగ్ ద్వారానే నిర్వహించాలని కోరుతూ స్థానిక జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం వద్ద శనివారం ఉపాధ్యాయులు మెరుపు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మోకాళ్ళపై నిలబడి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ మురళీమోహనరావు మాట్లాడుతూ ఉపాధ్యాయ సంఘాలతో జరిగిన చర్చల్లో విద్యాశాఖ అధికారులు సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు వెబ్ కౌన్సిలింగ్ కాకుండా మాన్యువల్ పద్ధతిలోనే బదిలీల కౌన్సిలింగ్ నిర్వహిస్తామని హామీ నిచ్చారని చెప్పారు. ఆ హామీని తుంగలో తొక్కి మళ్లీ వెబ్ కౌన్సిలింగ్ నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నారని చెప్పారు. ఇది నమ్మించి మోసం చేయడమే అవుతుందని విమర్శించారు. బదిలీల్లో అనేక సమస్యలు ఉన్నప్పటికీ ప్రధానంగా ఈ మ్యానువల్ కౌన్సిలింగ్ కోసం సంఘాలన్నీ పట్టు పట్టడం దానికి అధికారులు కూడా అంగీకరించారన్నారు. మళ్లీ మాట తప్పితే ఉపాధ్యాయుల ఉద్యమానికి అధికారులే కారణమవుతారని హెచ్చరించారు. తక్షణమే అధికారులు తమ నిర్ణయాన్ని వెనక్కి తీసుకొని ఎస్‌జిటి ఉపాధ్యాయులకు మాన్యువల్ పద్ధతిలో బదిలీలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రేపు ఉమ్మడి జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయాన్ని ఉపాధ్యాయులు ముట్టడిస్తారని చెప్పారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తక్షణమే స్పందించాలని, ఈ సమస్యని అధికారులుచే పరిష్కరింపచేయాలని కోరారు. లేనిపక్షంలో సోమవారం పార్వతీపురం వస్తున్న విద్యాశాఖ మంత్రికి ఉపాధ్యాయుల నిరసనస తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ పార్వతీపురం మన్యం జిల్లా ప్రధాన కార్యదర్శి, పిఆర్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి కాగాన విజయ్ కుమార్,



డిఇఒ కార్యాలయం వద్ద మోకాళ్లపై నిల్చొని నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

ఎపిటిఎఫ్ 257 జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.బాలకృష్ణ రావు, ఎపిటిఎఫ్ 1938 జిల్లా ప్రధాన కార్యదర్శి కూర్మినాయుడు, వివిధ మండలాల కార్యకర్తలు అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీతానగరం: ప్రభుత్వం చేపట్టిన ఉపాధ్యాయ బదిలీలలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు ప్రభుత్వ హామీ మేరకు మాన్యువల్ కౌన్సిలింగ్ పద్ధతి ద్వారా బదిలీలు చేపట్టాలని మండల ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య డిమాండ్ చేసింది. ఇటీవల ప్రభుత్వం ఉపాధ్యాయ సంఘాలతో చర్చల సమయంలో మాన్యువల్ కౌన్సిలింగ్ జరుపుతామని హామీ ఇచ్చి ఇప్పుడు వెబ్ కౌన్సిలింగ్ ద్వారా బదిలీలు జరుపుతామని ప్రకటించడంతో దానిని వ్యతిరేకిస్తూ మండల ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మార్సీ వద్ద శనివారం నిరసన కార్యక్రమం చేపట్టింది. అనంతరం విద్యాశాఖ అధికారి సూరిదేముడుకు వినతి పత్రం సమర్పించింది. ఈ సందర్భంగా ఉపాధ్యాయ ప్రతినిధులు మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన వెబ్ కౌన్సిలింగ్‌ను పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని మాన్యువల్ కౌన్సిలింగ్‌లోనే బదిలీలు జరపాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఈ ప్రయత్నాలను మానుకోకపోతే భవిష్యత్తులో తీవ్ర ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి బి.ప్రసాద రావు, ఎపిటిఎఫ్ అధ్యక్షులు పి.సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి ఎస్.సత్యంనాయుడు, పిఆర్‌టియు అధ్యక్షులు సిహెచ్. ఈశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపు మంత్రి లోకేష్ పర్యటన

ఏర్పాట్లు పరిశీలించిన మంత్రి, ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ జిల్లా పర్యటనకు సోమవారం రానున్న దృష్ట్యా రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యా రాణి, స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి, కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్, ఎస్‌పి ఎస్‌వి మాధవ రెడ్డి, ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ, ఎఎస్‌పి అంకిత సురానా శనివారం ఏర్పాట్లను పరిశీలించారు. పట్టణంలోని రాయల్ కన్వెన్షన్ హాల్‌లో పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను సత్కరించేందుకు గానూ ఏర్పాటు చేసిన "షైనింగ్ స్టార్స్ అవార్డు" కార్యక్రమంలో పాల్గొని, విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడే కార్యక్రమానికి వెంకంపేట దగ్గర్లో గల మైదానంలో నిర్వహించే బహిరంగ సభకు రానున్నారు. ఈ



సభా స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి సంధ్యారాణి, ఎమ్మెల్యేలు, ఎస్‌పి మాధవరెడ్డి

మేరకు రాయల్ కన్వెన్షన్ హాల్ను, బహిరంగ సమావేశ సభాస్తలిని పరిశీలించారు.. తదుపరి జిల్లాకు మొట్టమొదట సారిగా రాష్ట్ర విద్యా శాఖ మంత్రివర్యులు వస్తున్న నేపథ్యంలో పెద్ద ఎత్తున జనాలు వస్తారన్న ఆలోచనతో పటిష్ట భద్రత, ట్రాఫిక్ తదితర అంశాల్లో ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అదేవిధంగా ప్రజలు లోపలకి వచ్చే, పోయే మార్గాలు, వివిఐపి, విఐపి వాహనాల పార్కింగ్ స్థలాల వద్ద బందోబస్తు, భద్రతా ఏర్పాట్లను సమీక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు.

భారీ వర్షాల పట్ల అప్రమత్తం : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

వాతావరణ శాఖ హెచ్చరికల మేరకు ఈనెల 10 నుంచి 19 వరకు భారీ వర్షాలకు అవకాశం ఉందని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. భారీ వర్షాలు కారణంగా ఆకస్మికంగా వరదలు సంభవించే ప్రదేశాలు గుర్తించి అటువంటి ప్రదేశాల వద్ద అప్రమత్తం చేయాలని ఆదేశించారు. భారీ వరద ప్రవాహం సమయంలో నదులు, కాలువలు, చెరువులు తదితర జలవనరులలో దిగుటకు, దాటుటకు ప్రయత్నించరాదని ఆయన ఆదేశించారు. రహదారులు, కల్వర్టు పైనుండి నీరు పారే చోట్ల మరింత అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. గ్రామాల్లో పారిశుధ్యం పాటించాలని, వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు తగు సూచనలు ఇవ్వాలని వ్యవసాయ శాఖను ఆదేశించారు. భారీ వర్షాలు కారణంగా తాగు నీటి సరఫరా సమస్య తలెత్తకుండా అన్ని ముందు జాగ్రత్తలు తీసుకోవాలని గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులను ఆదేశించారు. విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడితే ఆసుపత్రుల అత్యవసర విభాగాల్లో వైద్య సేవలకు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టాలని వైద్య, ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. ప్రసవ తేదీల దగ్గరలో ఉన్న గర్భిణీలకు ముందుగా ఆసుపత్రులు, గర్భిణీల వసతి గృహాలకు తరలించాలని సూచించారు.



రోగులతో కిటకిటలాడుతున్న నీలకంఠాపురం పిహెచ్‌సి

వైద్యాధికారులు అందుబాటులో ఉండాలి : సిపిఎం

ప్రజాశక్తి- కురుపాం

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 24 గంటలూ వైద్య అధికారులు అందుబాటులో ఉండి గిరిజనులకు వైద్యం అందించేలా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. గిరిజనులకు విద్య, వైద్యం, మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు ఓవైపు ప్రభుత్వం ప్రకటిస్తోందని, క్షేత్రస్థాయిలో మాత్రం ప్రభుత్వ ఆశయాలకు వైద్య సిబ్బంది తూట్లు పొడుస్తున్నారని అన్నారు. గిరిజనుల ప్రాణానికి భరోసా ఇచ్చే పరిస్థితి కనిపించడం లేదన్నారు. గత కొద్దిరోజులుగా అల్పపీడనం కారణంగా కురిసిన వర్షాలతో గిరిజన గ్రామాల్లో జ్వరాలు విజృంభిస్తున్నాయని, శనివారం మండలంలో నీలకంఠపురం పిహెచ్‌సికి వైద్యం కోసం చుట్టు పక్కల గిరిజనులు సుమారు 100 మంది వస్తే వైద్యాధికారులు అందుబాటులో లేరని అక్కడ చికిత్స కోసం వచ్చిన రోగులు తెలిపారని ఆయన చెప్పారు. గిరిజన ప్రాంతానికి తలమానికం గా ఉన్న నీలకంఠాపురం పిహెచ్‌సి పరిధి గిరిజన గ్రామాల్లో ఎవరికి ఏ చిన్న అనారోగ్య సమస్య వచ్చినా ఇక్కడికే వస్తుంటారని, 24 గంటలూ అందు బాటులో ఉంటూ సేవలందించాల్సిన వైద్యులే అందు బాటులో లేకపోతే గిరిజనులకు వైద్యం ఎలా అందు తుందని ప్రశ్నించారు. అత్యవసర సమయం లో, ప్రమాదాలు సంభవించినప్పుడు గిరిజనుల ప్రాణాలు గాలికి వదిలేయడమే తప్ప వైద్యానికి భరోసా కనిపించడం లేదని వైద్యాధికారి ఒక్కరు సెలవు పెట్టి వెళ్లినప్పటికీ ఇంకొక వైద్యాధికారి అందుబాటులో ఉండి గిరిజనులకు వైద్యం అందించేలా అధికారులు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఆశ్రమ పాఠశాలలు.. సమస్యలకు నెలవు

- పాఠశాలల పునః ప్రారంభానికి ఇక ఐదు రోజులే
- విద్యార్థులకు తప్పని తిప్పలు

ప్రజాశక్తి - సీతంపేట

ప్రభుత్వాలు ఎన్ని మారినా గిరిజన విద్యారంగంలో సమస్యలు యథాతథమే. గిరిజన విద్య కోసం కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నామని మన పాలకులు గొప్పలు చెప్తున్నారు తప్ప అవి క్షేత్రస్థాయిలో అమలుకావడం లేదు. దీంతో గిరిజన ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో సమస్యలు యథాతథంగా ఉన్నాయి. కొన్ని పాఠశాలల్లో డార్మెంటరీ, డైనింగ్ హాలు తదితర అదనపు భవనాల సమస్య విద్యార్థులకు వెంటాడుతోంది. నిధుల్లేక నాడు-నేడు పనులు నిలిచిపోయాయి. ఆశ్రమాల్లో నాలుగో తరగతి సిబ్బంది అరకొరగా ఉన్నారు. గిరిజన విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ఆశ్రమ పాఠశాలల్లో ఎఎన్‌ఎంలను నియమించాలని పాలకులకు, అధికారులకు విన్నవించుకున్నా నేటికీ ఆ సమస్య సమస్యగానే మిగిలిపోయింది. పాఠశాలలు పునః ప్రారంభానికి మరో ఐదు రోజులు మాత్రమే గడువు ఉంది. అయితే ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయి. దీంతో ఈ విద్యా సంవత్సరం విద్యార్థులకు పాఠశాలలు సమస్యలతో స్వాగతం పలకున్నాయి.

సీతంపేట ఐటిడిఎకు అనుబంధంగా ఉన్న గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 47 గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, 16 పోస్టు మెట్రిక్ హాస్టళ్లలో సుమారు 15వేల మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. విద్యార్థులను ఒక్కొక్క పాఠశాల ఒక్కొక్క సమస్య వెంటాడుతూనే ఉంది. మండలంలోని సామరెల్లితో పాటు మరికొన్ని ఆశ్రమ పాఠశాలల్లో అదనపు భవనాల నిర్మాణానికి రెండో విడత నాడు-నేడు నిధులు మంజూరైనప్పటికీ ఆఖరులో నిధులు నిలిచిపోవడంతో అదనపు భవనాల పనులు నిలిచిపోయాయి. దీంతో పాటు అధికారులు ఐటిడిఎ పరిధిలో మరో 23 ఆశ్రమ పాఠశాలలకు అదనపు భవనాలు అవసరమని ప్రభుత్వానికి నివేదిక ఇటీవల అందజేశారు. అయినా నేటికీ నిధులు మంజూరు కాలేదు. ఆశ్రమ పాఠశాలల్లో గిరిజన విద్యార్థులకు సకాలంలో వైద్య సేవలందించడానికి ఎఎన్‌ఎం పోస్టులు ఇంతవరకూ భర్తీ చేయలేదు. ఆశ్రమాల్లో ఎఎన్‌ఎంలు ప్రథమ చికిత్సతో పాటు అత్యవసర సమయంలో విద్యార్థులు వెన్నంటే ఉంటూ వైద్యం అందిస్తారు. ఇప్పటికే విద్యాసంస్థల యాజమాన్యాలు, గిరిజన సంఘాలు ఈ పోస్టులు భర్తీ చేయాలని గిరిజన సంక్షేమ శాఖ మంత్రికి, అధికారులకు విన్నవించారు. నాయుడు మల్లి బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలో వేసవిలో రన్నింగ్ వాటర్, వాడుక నీటి సమస్య ప్రతి ఏటా వెంటాడుతూనే ఉంది. రెండు బోర్లు మాత్రమే ఉన్నాయి ఒకటి హాస్టల్‌కు, రెండో పాఠశాలకు ఉంది. రన్నింగ్ వాటర్ నీరు చాలకపోవడంతో మరో బోర్లు మంజూరు చేయాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.


వేధిస్తున్న సిబ్బంది కొరత

ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు తగ్గ బోధకులు, బోధన నేతర సిబ్బంది సమస్య వెంటాడుతుంది. విద్యార్థులకు తగ్గట్టుగా బోధకులు లేరు. ఎక్కువమంది విద్యార్థులు ఉంటే బోధకులు కూడా విద్యార్థుల సంఖ్య తగ్గట్టుగా ఉండాలి. దీంతో పాటు పాఠశాలలు, ఆఫీసు రికార్డులు నిర్వహించడానికి ఎల్‌డిసి, యుడిసి, రికార్డ్ అసిస్టెంట్లు సిబ్బంది లేరు. సీతంపేట ఐటిడిఎ పరిధిలో 11 పిజి హెచ్‌ఎం పోస్టు భర్తీ చేయాల్సి ఉంది. ప్యానెల్ గ్రేడ్ ప్రధానోపాధ్యాయులు బుడగరాయి, గొట్టిపల్లి, భామిని, మనముకొండ, చిపి, తర్లి, మర్రిగూడ, మందస, టెక్కలి ఆశ్రమ ఉన్నత పాఠశాలకు మంజూరు కాలేదు. దీంతో ఇన్‌ఛార్జితోనే నెట్టుకొస్తున్నారు. అలాగే కుక్, కమాటి, వాచ్మెన్ తదితర నాలుగో తరగతి సిబ్బంది ఆరకొరగానే ఉన్నారు. దీంతో సకాలంలో వంటకు సంబంధించిన పనులు కష్టమవుతుంది. 50 మందికి ముగ్గురు చొప్పున సిబ్బంది ఉండాలి.విద్యార్థుల సంఖ్య పెరిగే కొద్దీ సిబ్బంది కూడా పెరగాల్సి ఉన్నా ఆశ్రమ పాఠశాలల్లో ఆ పరిస్థితి లేదు.



అదనపు భవనానికి నోచుకోని సామరెల్లి ఆశ్రమ పాఠశాల

ప్రతిపాదనలు పంపించాం



ఆశ్రమ ఉన్నత పాఠశాలకు ఎఎన్‌ఎంలు అవసరమని ప్రభుత్వానికి ప్రతిపాదనలను పంపించాం. అదేవిధంగా 23 ఆశ్రమ ఉన్నత పాఠశాలకు అదనపు భవనాల కోసం ప్రతిపాదనలు పంపించాం.

ఎం.అన్నదొర, డిప్యూటీ డైరెక్టర్, ట్రైబల్ వెల్ఫేర్, సీతంపేట ఐటిడిఎ.

జీవనశైలిలో యోగా భాగం కావాలి : మంత్రి

ప్రజాశక్తి - సాలూరురూరల్

ప్రతి ఒక్కరి దైనందిన జీవనశైలిలో యోగా ఒక భాగం కావాలని రాష్ట్ర స్త్రీ శిశు, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సన్నాహక చర్యల్లో భాగంగా శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో మున్సిపల్ అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ యోగా అభ్యాసానికి ప్రతి ఒక్కరూ ప్రోత్సాహం ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఆధునిక కాలంలో మనిషి జీవనం ఉరుకులు, పరుగులుగా ఉందని, తీవ్రమైన ఒత్తిడితో మానసికంగా, ఆరోగ్యం పరంగా ఒడిదుడుకులకు గురువుతున్నారని అన్నారు. దైనందిన జీవనశైలిలో యోగా భాగమైనప్పుడే శారీరకంగా, మానసికంగా ఆనందకరమైన జీవితం సాధ్యమవుతుందన్నారు. యోగా మన ఆరోగ్యానికి మెరుగైన మార్గమని, జూన్ 21న జరిగే 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విశాఖలో జరగనుందని, దీనికి ప్రధాని నరేంద్ర మోడీ పాల్గొననున్నారని తెలిపారు. యోగా ఆరోగ్యానికి, మానసిక ప్రశాంతతకు, ఒత్తిడిని జయించేందుకు గొప్ప సాధనమని మంత్రి పేర్కొన్నారు. జిల్లాలో పెద్ద ఎత్తున యోగా కార్యక్రమాలు చేపడుతున్నామని, ప్రతి ఒక్కరూ ఇందులో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డిటివి కృష్ణారావు, మున్సిపల్ సిబ్బంది, అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

నేడు సీనియర్ సిటిజన్ల యోగా

పార్వతీపురం : యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా సీనియర్ సిటిజన్ల యోగా కార్యక్రమం ఆదివారం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు శనివారం సాయంత్రం సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సాలూరు, పార్వతీపురం, పాలకొండ మున్సిపాలిటీల పరిధిలో సీనియర్ సిటిజన్లతో యోగా కార్యక్రమం నిర్వహించాలన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో పోటీలను పూర్తి చేయాలని అనంతరం జిల్లా స్థాయి పోటీలు జరుగుతాయని చెప్పారు. వీడియో కాన్ఫరెన్స్‌లో పార్వతీపురం, సీతంపేట ఐటిడిఎ పిఒలు అశుతోష్ శ్రీవాస్తవ, సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, డిఆర్ఒ కె.హేమలత, సర్వ శిక్ష అభియాన్ ఏపీసీ తేజేశ్వరరావు, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి బి చంద్ర శేఖర్, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.



యోగాలో పాల్గొన్న మంత్రి సంధ్యారాణి

ఏనుగులను తరలించాలి : సిపిఎం

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలో గత రెండేళ్లుగా ఏనుగుల గుంపు సంచరిస్తుందని, ఈ గుంపును తక్షణమే తరలించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు రెడ్డి వేణు అధికారులను కోరారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో విలేకరులతో మాట్లాడారు. మండలంలో ఏనుగుల గుంపు ప్రవేశించి పంటలు నాశనం చేశాయని, పంటలు నష్టపోయిన రైతులకు నేటికీ నష్ట పరిహారం అధికారులు చెల్లించలేదని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే మూడు నెలల క్రితం అప్పయ్యపేట వద్ద ఏనుగుల జోన్ ఏర్పాటు చేసి ఏనుగులను సంరక్షిస్తామని అటవీశాఖ అధికారులు పనులు ప్రారంభిస్తే సిపిఎం అడ్డుకోవడం జరిగింది. అటవీ శాఖ అధికారులు గిరిజన, దళిత రైతులకు ఎలాంటి నష్టం కలగకుండా వారి భూములకు పట్టాలు ఇప్పిస్తామని, మూడు ఎకరాల పరిధిలో కుంకీ ఏనుగులను తీసుకువచ్చి వాటి ద్వారా మచ్చిక చేయించి ఏనుగుల సంరక్షణ ఆపైన ఏనుగులు ఎక్కడ నుండి వచ్చాయో అక్కడికే తరలిస్తామని మాట ఇచ్చారని తెలిపారు. అయితే నేటికీ కుంకీ ఏనుగులు రాలేదు, కానీ ఇప్పుడు ఒడిశా నుంచి తప్పిపోయిన ఏనుగులను అప్పయ్యపేటకు తరలిస్తున్నట్టు మండల ప్రజలు అనుమానిస్తున్నారని అన్నారు. మండల ప్రజలకు ప్రాణ, ఆస్తి, పంట నష్టం వాటిల్లకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తక్షణమే అటవీ శాఖ అధికారులు, ప్రభుత్వం ప్రజల అనుమానాలను నివృత్తి చేయాలని తెలిపారు. విలేకరుల సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి రెడ్డి ఈశ్వరరావు, నాయకులు గవర వెంకటరమణ, చందనపల్లి కృష్ణ, వై రామారావు పాల్గొన్నారు.

ఆడలేక మద్దెల ఓడు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి



నాట్యం చేయడం చేతకాని ఓ నృత్యకళాకారుడు మద్దెల సరిగా వాయించలేదన్నాడట. అచ్చంగా అలాగే ఉంది జిల్లాలో ప్రజాప్రతినిధులు, టిడిపి వీరాభిమానుల తీరు. ఏడాదిలో జిల్లాకు చేసిందేమిటిరా బాబూ... అని జనం మొత్తుకుంటుంటే గత పాలకులు రాష్ట్రాన్ని అప్పులపాల్జేశారని, జిల్లాను వెనక్కి నెట్టేశారని చెబుతున్నారు. అందుకే కదా వారందర్నీ చిత్తుచిత్తుగా ఓడించి, టిడిపి, జనసేన కూటమిని సింహాసనంపై కూర్చోండబెట్టింది. ఈ రెండు పార్టీల నాయకులు జగన్ ప్రభుత్వం కన్నా మెరుగైన పాలన చేస్తామని చెప్పారు అప్పుడు ప్రతిపక్షంలో ఉంటే మాత్రం.. రాష్ట్రం ఎంతమేర అప్పుల్లో ఉంటే ఆ మాత్రం తెలియకుండా హామీలు ఇచ్చారా? అన్నది జనం మాట. మిగులు బడ్జెట్‌లో ఎవరైనా నడిపిస్తారు. అందులోనూ సంపద సృష్టిస్తానన్నాడు చంద్రబాబు, ఇప్పుడేమో అప్పులు పుట్టడం లేదంటున్నారు. వీటికి సమాధానం చెప్పాల్సిన ఉమ్మడి జిల్లాలకు చెందిన మంత్రి వర్యులు శ్రీనివాసరావు, సంధ్యారాణి కలిసి తప్పించుకు తిరుగువాడు ధన్యుడు సుమతీ అన్నట్టుగా రోటీన్ డైలాగులతో గత ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నారు. నిజమే గత పాలకులేమీ తక్కువ తినలేదు. కానీ, గతం కన్నా మెరుగైన పాలన అందిస్తామని చెప్పింది టిడిపియే కదా? మరి ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం సూపర్ సిక్స్ అమలైందా? ఎందుకు అమలు చేయలేకపోతున్నారు? ఏడాదిలో అమలు చేసిందేమిటి? అన్నది పరిశీలిస్తే అరకొరే. ఔను...! ఉన్నమాట చెప్పుకోవాలి. పింఛను రూ.3వేల నుంచి 4వేలకు పెంచడంతోపాటు మూడు నెలల బకాయి కూడా చెల్లించారు. ఏడాదికి మూడు సిలెండర్ల పథకం అమల్లోకి వచ్చింది. కానీ, ముందుగా డబ్బులు చెల్లించాలనే మెలిక పెట్టడం, ఆ తరువాత ఆ డబ్బులు తిరిగి కొంతమందికే రియింబర్స్‌మెంట్ కావడంతో ఈ పథకం చాలా మందికి రుచించడం లేదు. మరి రైతులకు ఏటా ఇస్తామన్న రూ.20వేల పెట్టుబడి సాయం ఎందుకు అమలు కాలేదు. గత ఏడాది ఖరీఫ్‌లో ఎలాగూ ఇవ్వలేదు. మరోవైపు ఖరీఫ్ సీజన్ ముంచుకొస్తోంది. ఇప్పటి ఆదిశగా ప్రయత్నాలు లేవు. గత ప్రభుత్వం పెట్టుబడి సాయం కింద ఏటా రూ.13,500 చొప్పున అందజేసింది. మరోవైపు గత ప్రభుత్వం అమలు చేసిన అమ్మఒడి స్థానంలో తల్లికి వందనం కింద రూ.15వేల చెల్లిస్తామని చెప్పారు. దీన్ని ఈ ఏడాది అమలు చేస్తామని చెప్తున్నప్పటికీ గత ఏడాది బకాయి కోసం మాట్లాడడం లేదు. నిరుద్యోగులకు రూ.3వేలు నష్టపరిహారం, మహిళలకు ఉచిత బస్సు సదుపాయం కోసం మాట్లాడడం లేదు. ఇక జిల్లా విషయానికి వస్తే గడిచిన రెండు బడ్జెట్లలోనూ సాగునీటి వనరుల అభివృద్ధికి గత ప్రభుత్వం కన్నా ఎక్కువ బడ్జెట్ ఏమీ ఇచ్చేయలేదు. హడావుడి మాత్రం అంతా ఇంతా చేయలేదు. ఇటీవల ఏకంగా ఇరిగేషన్ శాఖ మంత్రి వచ్చి రామతీర్థసాగర్ పూర్తిచేస్తామని చెప్పారే తప్ప, నిధుల గుర్తించి మాట్లాడితే నోరెళ్లబెట్టారు. తోటపల్లి మిగులు పనులు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చంద్రంగా ఉంది. ఎంఎస్ఎంఇ పార్కుల పేరుతో భూముల సేకరణ మినహా ఏడాదిలో ఒక్కటంటే ఒక్క పరిశ్రమ కూడా రాలేదు. ఇంకా చెప్పాలంటే భీమసింగి సుగర్ ఫ్యాక్టరీ, కొత్తవలసలో జిందాల్ పరిశ్రమ సహా పలు ఫెర్రోఎల్లాయిస్, జ్యూట్ పరిశ్రమలు మూతపడ్డాయి. ఏడాదిగా పర్యాటకాభివృద్ధి అనడమే తప్ప, ఆచరణలో ఇప్పటి వరకు కనిపించలేదు. సరే... ఇంకా అమాత్యులు, ఎమ్మెల్యేలు, ఎంపీ చెప్తున్నట్టు ఇంకా గడిచిన ప్రభుత్వం మిగిల్చిన నష్టాల నుంచి గట్టెక్కుతున్నారే అనుకుందాం. అలాంటప్పుడు గత పాలకులపై ఏడుపులెందుకు అంటూ జనం చర్చించుకుంటున్నారు. అందుకే మంచి గతమున కొంచెమేనోయ్... మందగించక ముందుకడుగేయ్... అన్న గురజాడ స్ఫూర్తిని ఎందుకు తీసుకోకూడదన్నదని జనం ప్రశ్న.

షైనింగ్ స్టార్ అవార్డులకు ఐదుగురు ఎంపిక

ప్రజాశక్తి - సీతానగరం



వీరఘట్టం: యువరాజు, గ్రీష్మ

పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ చూపిన మండలంలోని నిడగల్లు, సీతానగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు చెందిన బోగి హాసిని, కేతల ప్రవీణ్, రాయిపల్లి ప్రజ్ఞ "షైనింగ్ స్టార్ స్టూడెంట్‌గా సెలెక్ట్ అయ్యారు. వీరికి సోమవారం ఈనెల 9న జరగబోయే కార్యక్రమంలో రాష్ట్ర విద్యాశాఖామంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా రూ.20 వేలు నగదు బహుమతి, ప్రశంసా పత్రం అందజేయనున్నారు. ఎంపికైన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

వీరఘట్టం : మండలంలోని నీలానగర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ధర్మాన గ్రీష్మ, కోమటి యువరాజులు సైనింగ్ స్టార్స్ ప్రతిభ అవార్డులకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు జి.రవిప్రసాద్ శనివారం తెలిపారు. ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో అధికంగా గ్రీష్మ 578, యువరాజు 563 మార్కులతో ఉత్తీర్ణత సాధించడంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చర్యలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. ఇద్దరు విద్యార్థులు ప్రతిభ అవార్డుకు ఎంపిక కావడంతో అభినందనలు తెలిపారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి - సీతానగరం

జిల్లా అంధత్వ నివారణ సంస్థ వారి ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి వారి సౌజన్యంతో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు క్యాంప్ జూనియర్ మేనేజర్ సిహెచ్ వెంకటరమణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరానికి వచ్చిన రోగులు తప్పనసరిగా వారి ఆరోగ్యశ్రీ, ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్ పాస్ పుస్తకం, ఫోన్ నెంబరు రెండు జాతుల బట్టలు తీసుకురావాలని సూచించారు అన్ని కంటి వ్యాధులకు ఉచితంగా కంటి పరీక్షలు జరిపి వారికి ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత ఆపరేషన్లు చేయబడతాయని తెలిపారు



మాట్లాడుతున్న సైంటిస్ట్ విశ్వనాథరెడ్డి

పంటల సాగులో మెలకువలు పాటించాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

పంటల సాగులో మెలకువలు పాటించాలని సైంటిస్ట్ విశ్వనాథరెడ్డి, కృషి విజ్ఞాన కేంద్ర రస్తకుంట రైతులకు సూచిం చారు. శనివారం మండ లంలోని విక్రంపురం, కిమ్మీ, కె.ఇచ్చాపురం గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న వికసిత్ సంకల్ప కృషి అభియాన్ కార్యక్రమంలో భాగంగా రైతులతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. వివిధ రకాల పంటలు సాగు, అధిక దిగుబడులు ఎలా సాధించాలని, ప్రకృతి వ్యవసాయం చేయడం వల్ల లాభాలు, కెమికల్ ఎరువుల వల్ల నష్టాలు, ఉద్యాన పంటల సాగులో మెలుకులపై రైతులకి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కురుపాం మండల సబ్జెక్టు మేటర్ స్పెషలిస్ట్ అమృతవీణ, వ్యవసాయ శాఖ ఏడి శారద, స్థానిక ఉద్యానశాఖ అధికారి టి.అమరేశ్వరి, రైతులు పాల్గొన్నారు.



పరసయ్య కుటుంబ సభ్యులతో మాట్లాడుతున ఎమ్మెల్యే జగదీశ్వరి

కార్యకర్తకు ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి - కురుపాం

జియ్యమ్మవలస మండలం చంద్రశేఖరరాజపురం గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త పిన్నిటి పరసయ్య తల్లి నారాయణమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి శనివారం సాయంత్రం వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు అన్ని విధాలుగా అండగా ఉంటానని ధైర్యాన్ని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు పల్లా రాంబాబు, ఎంపిపి బొంగు సురేష్, అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



రైతులకు పశుదాణా అందిస్తున్న ఎంఎసి చైర్మన్ సూర్యనారాయణ

రాయితీపై పశుదాణా

ప్రజాశక్తి - పాచిపెంట

పాడి రైతులకు 50 శాతం రాయితీపై రాష్ట్ర ప్రభుత్వం పశు ధాణా మంజూరు చేసిందని సాలూరు ఎఎంసి చైర్మన్ ముఖీ సూర్యనారాయణ తెలిపారు. శనివారం స్థానిక పశు వైద్యశాల వద్ద పాడి రైతులకు 50 కేజీల పశుదాణా సంచులను ఆయన అందజేశారు. మండలానికి 286 క్వింటాల పశుదాణా మంజూరైందన్నారు. 50 కేజీల బస్తా రూ.1110 కాగా, ప్రభుత్వం 50 శాతం రాయితీపై రూ.555కు పాడి రైతులకు అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారి మంచాల వెంకటరమణ, మండల టిడిపి ప్రధాన కార్యదర్శి గూడెపు యుగంధర్, కొత్తల పోలినాయుడు, పిన్నింటి ఈశ్వరరావు, ఎంపిటిసి సభ్యులు దండి ఏడుకొండలు, పల్లేడ ఉమామహేశ్వరరావు, ఎఎంసి డైరెక్టర్ పూసర్ల నరసింహారావు, నడిపల్లి మెహర్ బాబా, మతల బలరాం, పశువైద్య శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఏజెన్సీలో వర్షం

ప్రజాశక్తి - సీతంపేట

సీతంపేట ఏజెన్సీలో శనివారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఉదయం అంతా ఎండ భగ భగ మంటూ సాయంత్రం అయ్యేసరికి వాతావరణం ఒక్కసారిగా చల్లబడి నీలిమేఘాలు చుట్టూ కమ్మేసి మేఘం చీకటి చేసి 6 గంటలకే వర్షం కురిసింది. సీతంపేట, హడ్డుబంగి, గుమ్మడ, పూతికవలస, ఈతమానుగూడ పరిసర ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. అయితే ఈ వర్షం అల్లం, పసుపు, కంద పంటలకు ఉపయోగపడుతుందని గిరిజనులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

9న నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ విడుదల

ప్రజాశక్తి - పార్వతీపురం

నియోజక వర్గం విజన్ యాక్షన్ ప్లాన్ ఈనెల 9న విడుదల అవుతుందని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు శనివారం సాయంత్రం సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర వ్యాప్తంగా విజన్ యాక్షన్ ప్లాన్ విడుదలను సోమవారం చేపట్టనున్నారని అనంతరం నియోజకవర్గాల్లో ఈ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. స్థానిక కార్యక్రమాలకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. సంబంధిత ఎమ్మెల్యేలను ఆహ్వానించి కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆయన చెప్పారు.

ఐఐటి- జెఇఇలో వేదాంత విద్యా కుసుమాలు

ప్రజాశక్తి- పార్వతీపురం

ఎన్‌సిఇఆర్‌టి సిలబస్ ఐఐటి - జెఇఇ, సియుఇటి వంటి పోటీ పరీక్షల్లో పాల్గొనే విద్యార్థులకు అత్యుత్తమ శిక్షణ అందివ్వడంతో స్థానిక వేదాంత విద్యార్థులు గణనీయమైన ప్రతిభను కనబరిచి జాతీయస్థాయి ర్యాంకులు సాధించ గలుగుతున్నారు. ఉన్నత విద్యా శిఖరాలకు చేరుకున్న వేదాంత విద్యార్థి కుసుమాలు సువాసన వెదజల్లుతున్నారు. 2022, 2023,2024 వరుసుగా మూడేళ్లలో హ్యాట్రిక్ విజయాలను సాధిస్తూ 2025 విద్యా సంవత్సరంలోనూ నాలుగో సారి కూడా ఆలిండియా స్థాయిలో ర్యాంకులను సాధించిన ఘనత వేదాంత జూనియర్ కళాశాలదే. పార్వతీపురం మన్యం జిల్లాలో గల ప్రైవేటు కళాశాలలకు ధీటుగా ప్రత్యేక ఐఐటి, నీట్ విద్యాసంస్థగా గుర్తింపు పొందింది. జిల్లాస్థాయి ఉన్నతాధికారుల నుంచి వేదాంత ఐఐటి నీట్ అకాడమీ కాలేజ్ మన్ననలను పొందుతోంది. 2025 విద్యా సంవత్సరంలో ఐఐటి జెఇఇ (B. Arch)లో డొంకాడ చందన్ ఆలిండియాలో 1827 ర్యాంకును సాధించగా, జస్వంత్ ఆదిత్య, సుప్రియులు మెయిన్స్‌లో అత్యుత్తమ పర్సంటైల్‌తో ఎన్ఐటి సీట్లు సాధించే దిశగా అడుగులు వేస్తున్నారు. 2022, 2023, 2024 విద్యాసంవత్సరాల్లో ఐఐటి అడ్వాన్స్‌లో ఇద్దరు విద్యార్థులు, ఐఐటి మెయిన్స్‌లో ముగ్గురు విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులను సాధించారు. 2024, 2023, 2022 విద్యా సంవత్సరానికి వేదాంత ఐఐటి నీట్ విద్యార్థులలో జెఇఇ అడ్వాన్సుడులో 2023లో 1910, 1917 ర్యాంకులను, 2022లో మెయిన్ 2755 జాతీయస్థాయి అత్యుత్తమ ర్యాంకులు సాధించి గుర్తింపు పొందిన ఐఐటి క్యాంపస్‌ల్లో సీట్లు పొందారు. 2024 నీట్ ద్వారా అత్యుత్తమ ర్యాంకు సాధించిన విద్యార్థులు విజయనగరం మిమ్స్‌లో హెూమియో మెడికల్ సైన్స్,లో ఉన్నత చదువులు చదువుతున్నారు. 2022 విద్యా సంవత్సరం నీట్ ద్వారా డెంటల్ కోర్సుల్లో అర్హత పొంది దంత వైద్యుని శిక్షణ పొందుతున్నారు. రాష్ట్రస్థాయిలో బి ఆర్చ్ ఎంట్రన్స్‌లో స్టేట్ థర్డ్ ర్యాంక్, ఎంసెట్ 3532 అత్యుత్తమ ర్యాంకును వేదాంత కాలేజీ విద్యార్థి సాధించారు.

సెకండ్ ఇంటర్ ఎంపిసిలో సిహెచ్ జోత్స్న 1000 మార్కులకు గానూ 979 మార్కులు, పి సాక్షిత్, ఎల్ హారిక 974 మార్కులను సాధించి ప్రథమ, ద్వితీయ స్థానాలతో ఉత్తమ ఫలితాలతో పాటు 900 మార్కులు పైబడి 51 మంది సాధించారు. ప్రథమ ఇంటర్లో ఎంపిసిలో 470 మార్కులకు బి.సునయన దొర 465 మార్కులు సాధించగా, బైపిసిలో వై.అక్షయ 440 మార్కులకు 434 మార్కులు సాధించారు. 400 పైబడి మార్కులను 63 మంది సాధించి పట్టణంలో వేదాంత విద్యార్థులు ప్రభంజనాన్ని సృష్టించారు. మైనార్టీ విభాగంలో మహమ్మద్ సబ్‌నూర్ ప్రభుత్వం ప్రకటించిన ప్రతిభా పురస్కారానికి ఎంపికైంది. వేదాంత ఘనవిజయాలు సాధించిన విద్యార్థులు ప్రభుత్వ బడుల్లో చదువుకుంటూ, పెట్రోల్ బంకు, వ్యవసాయం, కూలి చేసుకుంటున్న సాధారణ పేద, మధ్యతరగతి కుటుంబాల నుండి వచ్చిన విద్యార్థులే. వీరిని ఆణిముత్యాలుగా తీర్చిదిద్దుతున్న వేదాంత ఐఐటి నీట్ అకాడమీ సంస్థ జిల్లా ఉన్నత అధికారుల మన్ననలను పొందుతుంది.

సామాజిక కార్యక్రమాల్లో వేదాంత ముందంజ

ప్రతి ఏటా ఉపాధ్యాయ దినోత్సవ, సైన్స్‌డే, ఫేర్వెల్స్ డే వంటి కార్యక్రమాలు నిర్వహిస్తూ సౌజన్య హాస్పిటల్ అధినేత డాక్టర్ పి.బి.పి.ఆర్ నాయుడు(నాని), ప్రజా కవి గంటేడ గౌరు నాయుడు, జిల్లా ఉన్నతాధికారులను ఆహ్వానించి వారి సూచనలు, సలహాలను అందిపుచ్చుకుని సామాజిక దక్పథాన్ని విద్యార్థులకు అలవర్చుకొనేలా కార్యక్రమాలు చేపడుతున్నారు.



న్యాయ అవగాహన సదస్సుకు హాజరైన వేదాంత విద్యార్థులు



ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

ఇంతటి విజయాలు ఎలా?



పి.అప్పారావు, చీఫ్ మెంటర్




ఎస్ఎల్ నాయుడు, ప్రిన్సిపల్

కార్పొరేట్ కాలేజీలో లక్షలాది డబ్బులను ఖర్చుపెట్టిన కొంతమంది సాధించలేని విజయాలు స్థాని కంగా పేద, మధ్యతరగతి విద్యార్థులకు అందుబాటులో ఉన్న ఫీజులతో ఐఐటి, మెయిన్స్, నీట్ ర్యాంకులను వేదంతా ఐఐటి నీట్ అకాడమీ విద్యార్థులు సాధిస్తు న్నారు. దీని వెనుక కార్పొరేట్ సంస్థల్లో ఫిజిక్స్ లోను 30 ఏళ్ల సాంకేతిక విద్యలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా అపారమైన అనుభవజ్ఞులు డాక్టర్ పెంట అప్పారావు, గణితంలో 25 ఏళ్ల అనుభవజ్ఞులు ఎస్ఎల్ నాయుడు బోధనతో పాటు కెమిస్ట్రీలోనూ అనుభవిజ్ఞులైన అధ్యాపకుల కృషి ఉంది. ఎడ్యుకేషన్ ప్రత్యేక సంచిక సందర్భంగా వేదాంత ఐఐటి జెఇఇ అకాడమీ విద్యాసంస్థ చీఫ్ మెంటర్ డాక్టర్ పెంట అప్పారావు, మ్యాథమెటిక్ అధ్యాపకులు ఎస్ఎల్ నాయుడు మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం మొదటి నుండి ఐఐటి -జెఇఇ, నీట్, ఎంసెట్ ఎంట్రన్స్ రాసే విద్యార్థులకు వారాహి, వైద్య, వజ్ర, వీర ట్రాక్లతో విద్యార్థులకు ఆబ్జెక్టివ్లో ఆ సంస్థలో చేరిన సంవత్సరం నుంచే పూర్తిస్థాయిలో శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు.

బూడిదవుతున్న పంచాయతీ సంపద

ప్రజాశక్తి - వీరఘట్టం



దశమంతపురం రోడ్డు పక్కనే వేసిన చెత్త

పరిసరాల పరిశుభ్రతతో పాటు ప్రజలు కూడా ఆరోగ్యంగా ఉంటారని, గ్రామాల్లో సేకరించిన చెత్తను చెత్త సంపద కేంద్రానికి తరలించి సంపదను సృష్టించి వాటి ద్వారా వచ్చే ఆదాయాన్ని పంచాయతీల అభివృద్ధికి దోహదపడతాయన్న ఉద్దేశంతో టిడిపి ప్రభుత్వ హాయంలో చెత్త సంపద కేంద్రాల నిర్వహణకు శ్రీకారం చుట్టింది. మండలంలో ఉపాధి హామీ పథకం ద్వారా అప్పట్లో లక్షలాది రూపాయలు వెచ్చించి ప్రతి పంచాయతీలోనూ సంపద కేంద్రాలు నిర్మించారు. అప్పట్లో చెత్త నుంచి సంపద తయారు చేయడంతో కొంతమేర సంపద పంచాయతీలకు వస్తూ ఉండేది. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సంపద కేంద్రాలపై దృష్టి పెట్టకపోవడంతో లక్షలాది రూపాయలు వెచ్చించిన సంపద కేంద్రాలు మూలన పడ్డాయి. మరలా కూటమి ప్రభుత్వ అధికారంలోకి రావడంతో సంపద కేంద్రాలపై దృష్టి పెట్టింది. ఉన్నత స్థాయి అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో దిగువ స్థాయి సిబ్బంది సంపద కేంద్రాలపై దృష్టి సారించకపోవడంతో చెత్త నుంచి సంపద తయారు చేయవలసి ఉన్నప్పటికీ ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. దీంతో పంచాయతీలకు రావలసిన ఆదాయం బూడిద అయిపోతుందని, అధికారులపై స్థానికులు విమర్శలు గుప్పిస్తున్నారు. ప్రభుత్వ ఆశయం నెరవేరాలంటే ఇప్పటికైనా అధికారులు స్పందించి సంపద కేంద్రాల నిర్వహణపై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ చేపట్టాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్‌ను చేపట్టాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. శనివారం సంబంధిత అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో మలేరియా ప్రభావిత ప్రాంతాలున్నాయని, ఆయా ప్రాంతాల్లో మరింత సమర్థవంతంగా డ్రైవ్ నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి గ్రామంలో మంచి పారిశుధ్య పరిస్థితులు ఏర్పడాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. అందుకు గ్రామ పంచాయతీలు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. గ్రామాల్లో పెద్ద ఎత్తున అవగాహన తీసుకురావాలన్నారు. ప్రతి ఇంటి నుంచి తడి చెత్త, పొడి చెత్త సేకరణ జరగాలని, వాటిని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలకు పంపించాలని సూచించారు. వ్యక్తిగతం గానూ, గృహపరంగానూ పరిశుభ్రమైన వాతావరణం కలిగి ఉండాలని, తద్వారా రోగాలకు దూరంగా ఉండవచ్చని అన్నారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే నిర్వహించాలన్నారు. నీటి నిలువకు అవకాశం లేకుండా ఖాళీ కొబ్బరి బొండాలు, సీసాలు, టైర్లు, పాత్రలు తదితర పరికరాలపై దృష్టి సారించి అవి ఎక్కడా లేకుండా చూడాలన్నారు. జూన్‌లోనే పారిశుధ్య డ్రైవ్ చేపట్టడం వల్ల రానున్న నెలలో సులభతరమవుతుందని చెప్పారు. మురుగు కాలువల్లో ఆయిల్ బాల్స్ వేయడం, ఇతర దోమల నివారణ కార్యక్రమాలను చేపట్టాలన్నారు. గ్రామాల దగ్గర్లో ఉండే నీటి వనరుల్లో గంభూజియా చేపలను వదలడం వల్ల లార్వా నిరోధక వ్యవస్థగా పనిచేస్తుందని చెప్పారు. ప్రతి ఇంట్లోనూ, బయట దోమల నివారణగా స్ప్రేయింగ్ జరగాలని ఆదేశించారు. దోమ తెరల ప్రయోజనాలపై అవగాహన కల్పించాలన్నారు. మున్సిపాల్టీలోనూ శానిటేషన్ డ్రైవ్ చేపట్టాలని ఆదేశించారు. మురుగునీరు ఎక్కడ నిలువ లేకుండా చూడాలని అన్నారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా బక్రీద్ వేడుకలు

ప్రజాశక్తి - కురుపాం



ప్రార్థనలు చేస్తున్న ముస్లిం సోదరులు

మండల కేంద్రమైన కురుపాంలో గల జామియా మసీదులో బక్రీద్ పండగను పురస్కరించుకొని శనివారం ఇమామ్ (మత గురువు) దిల్ మహ్మద్ ఆధ్వర్యంలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా మత గురువు మాట్లాడుతూ బక్రీద్ పండగ అల్లా ఆజ్ఞ మేరకు తన కన్న కొడుకునే త్యాగం చేయడానికి సిద్ధమైన దైవ దూత మహమ్మద్ ప్రవక్త త్యాగానికి ప్రతీకగా బక్రీద్ పండగ జరుపుకుంటారని అన్నారు. త్యాగం, దానం, సోదర భావం, భక్తి ఈ పండగ ముఖ్యోద్దేశ్యమన్నారు. నమాజ్ అనంతరం ఒకరిని ఒకరు ఆలింగనం చేసుకుని పండగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ ప్రార్థనలో కురుపాం, చినమేరంగి, గుమ్మలక్ష్మీపురం ముస్లిం సోదరులు కుటుంబ సభ్యులతో పాల్గొన్నారు.

నవధాన్యాల సాగు.. భూసారం బాగు

ప్రజాశక్తి - పాచిపెంట



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎఒ తిరుపతిరావు

నవధాన్యాలను సాగు చేసి 30 లేదా 40 రోజుల తర్వాత కలియ దున్నడం ద్వారా భూసారం ఎంతో మెరుగుపడుతుందని మండల వ్యవసాయాధికారి కె.తిరుపతిరావు అన్నారు. మండలంలోని అజరి, కంకణాపల్లిలో గ్రామ వ్యవసాయ సహాయకులు నాగమణి, మోహన్ కృష్ణ ఆధ్వర్యంలో గిరిజన రైతులతో ఏర్పాటు చేసిన నవధాన్యాల సాగుపై అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నవధాన్యాలు ఒక కొత్త శాస్త్రీయ విధానమని, వీటిని కలియదున్నడం ద్వారా భూసారాన్ని ఎంతో మెరుగు పరుచుకోవచ్చని తెలిపారరు. గిరిజన రైతులు ముఖ్యంగా వరి పంటను కేవలం తమ ఇంటి అవసరాల కోసమే వినియోగిస్తారు కాబట్టి నవధాన్యాలు సాగు చేసి కలియదున్ని అనంతరం వరి పంటను నాటడం ద్వారా రసాయన ఎరువులు, పురుగుమందులు వినియోగించ కుండానే నాణ్యమైన పంట పండుతుందని తెలిపారు. కావున గిరిజన రైతులంతా నవధా న్యాలను సాగు చేసుకోవాలని సూచించారు. జీడి మామిడి తోటల దిగుబడికి నవధాన్యాలను కలియ దున్నాలని తెలిపారు. నవధాన్యాలు పశువుల మేతగా పనికి వస్తాయని, పాలలో వెన్న శాతం పెరుగుతుందన్నారు. అంతేకాకుండా 15 నుంచి 20 రకాల వేరు వ్యవస్థలు భూమిలోనికి చేరడం వల్ల కొన్ని కోట్ల జీవ వైవిధ్యం వేర్ల చుట్టూ చేరి అత్యంత విలువైన పోషకాలను పంటకు అందిస్తాయని తెలిపారు. ఇది ఒక కొత్త శాస్త్రీయ విధానమన్నారు. అలాగే కొర్ర, చోడి విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని, వీటిని 90శాతం రాయితీపై గిరిజన రైతులకు అందిస్తున్నామని తెలిపారు. రాగులు కిలో 49 రూపాయలకు పైగా మద్దతు ధర లభిస్తుందని, కావున చిరుధాన్యాల విస్తీర్ణాన్ని పెంచాలని కోరారు. కార్యక్రమంలో ప్రకృతి సేద్య ఎల్ వన్ కొండేటి విజయ్, రైతులు పాల్గొన్నారు.

ప్రమాదాలకు నిలయాలుగా స్పీడ్ బ్రేకర్లు

ప్రజాశక్తి - మక్కువ

గుర్తించలేక ప్రమాదాలు



ప్రమాదకరంగా ఉన్న స్పీడు బ్రేకర్ (వృత్తంలో)

రహదారులలో వాహనదారుల వేగాన్ని నియంత్రించేందుకు ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్లు ప్రమాదాలకు నిలయాలుగా మారాయని వాహన దారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మక్కువ - దుగ్గేరు ప్రధాన రహదారిలోని తెలగడవలస జంక్షన్ ముందున్న మలుపు వద్ద వేసిన స్పీడ్ బ్రేకర్లు తరచూ ప్రమాదాలకు కారణమవుతున్నాయని వాహన దారులు వాపోతున్నారు. కనీసం నిబంధనలు పాటించకుండా ఇష్టానురీతిగా వేయడం వల్ల ఈ ప్రమాదాల జరుగుతున్నాయని అంటున్నారు. స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసినప్పటికీ ఏ విధమైన గుర్తులు లేకుండా ఉండడమే కాకుండా, నిర్మించాల్సిన ఎత్తు కంటే ఎక్కువ ఎత్తుగా నిర్మించడం చిన్నచిన్న వాహనదారులకు ప్రమాదాలు తెచ్చిపెడుతున్నాయి. ఇప్పటికీ చాలా మంది వాహనదారులు వీటి బారిన బడి ప్రమాదాలకు గురయ్యారు. ఇలా గాయపడిన వారిలో సంబర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధి కారిని కూడా ఉన్నారు. ప్రైవేటు వ్యక్తి ఈ స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేసుకున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎవరి అనుమతితో ఇక్కడ బ్రేకర్లు నిర్మించారన్నది కూడా తెలియటం లేదని పలువురు అంటున్నారు. ఇప్పటికైనా ఆర్ అండ్ బి అధికారులు స్పందించి, నిబంధనసుసారంగా స్పీడ్ బ్రేకర్లను పున రుద్ధరించాలని, లేదంటే స్పీడ్ బ్రేకర్లను గుర్తించేలా గుర్తులు ఏర్పాటు చేయాలని వాహన చోదకులు డిమాండ్ చేస్తున్నారు.

నకిలీ విత్తనాలు అమ్మిన వారిపై చర్యలు తీసుకోవాలి: సిపిఎం

ప్రజాశక్తి - కొమరాడ

లైసెన్సు లేకుండా నకిలీ పత్తి విత్తనాలు అమ్మే వారి పైన వ్యవసాయ శాఖ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. పత్తి విత్తనాలు నాటే సమయం రావడంతో జోరుగా నకిలీ పత్తి విత్తనాలు మండలంలో అటు ఒరిస్సా నుండి తెచ్చి మధ్య దళారులు అధిక రేటుకు అమ్మే పరిస్థితి ఉందన్నారు. ముఖ్యంగా నాగావళి నది అవతల కొంతమంది రైతులు, వీరఘట్టం పాలకొండ నుండి కూడా మధ్య దళారులు పత్తి పండించే రైతులకి అధిక రేటుతో పాటు అరువు కూడా ఇచ్చే పరిస్థితిలో భాగంగా ఇష్టం వచ్చినట్లుగా మ్యానుఫ్యాక్చర్ డేట్ అయిపోయిన విత్తనాలు కూడా తెచ్చి అమ్ముతున్నారని అన్నారు. కొత్త కవర్లో వేసి మ్యానుఫ్యాక్చర్ చేసి రైతులకు అమ్మేస్తున్నారని దీనివల్ల రైతులు చాలా నష్టపోయే పరిస్థితి కనిపిస్తుందని వెంటనే వ్యవసాయ శాఖ అధికారులు స్పందించాలని కోరారు. అధికారులు ప్రత్యేక దృష్టి సారించి ఎవరైతే నకిలీ పత్తి విత్తనాలు లైసెన్స్ లేకుండా అమ్ముతున్నారో వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు.

టిడ్కో ఇళ్లకు మోక్షమెప్పుడు?

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

టిడ్కో ఇళ్లకు మోక్షం ఎప్పుడని కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రశ్నించారు. శనివారం కాంగ్రెస్ పార్టీ ఒబిసి జిల్లా అధ్యక్షులు వంగల దాలినాయుడు, జిల్లా నాయకులు కోలా కిరణ్ కుమార్, మండల అధ్యక్షులు తీళ్ళ గౌరీశంకరరావు మాట్లాడుతూ గత ఎనిమిదేళ్లుగా టిడ్కో ఇళ్ల కోసం ఆశగా ఎదురుచూస్తున్న లబ్ధిదారులకు నిరాశే మిగిలిందన్నారు. టిడ్కో గృహాల విషయంలో వైసిపి, కూటమి ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. కాంగ్రెస్ పాలనలోనే పేదలందరికీ ఇందిరమ్మ ఇల్లు సాధ్యమన్నారు. 2017లో అధికారంలో ఉన్న టిడిపి ప్రవేశపెట్టిన టిడ్కో గృహాలు ఇప్పటివరకు లబ్ధిదారులకు అందకపోవడం అన్యాయమన్నారు. పార్వతీపురానికి 1104, సాలూరుకు 1440 టిడ్కో గృహాలను మంజూరు చేసి వాటికోసం లబ్ధిదారుల నుండి కొంత మొత్తం డీడీలు రూపంలో వసూలు చేసినా ఇళ్లను మాత్రం వారికి అప్పగించకపోవడం దారుణమన్నారు. తక్షణమే టిడ్కో గృహాలు విషయమై కూటమి ప్రభుత్వం దృష్టి సారించి లబ్ధిదారులకు న్యాయం చేయాలన్నారు.

నాలుగు నెలలకే బీటలు

ప్రజాశక్తి - వీరఘట్టం



దెబ్బతిన్న రహదారి

మండల కేంద్రం లోని బిఎంఆర్ థియేటర్ నుండి చలివేంద్రి మీదుగా నర్సిపురం వరకు ఈ ఏడాది ఫిబ్రవరిలో రహదారి మరమ్మతులు చేపట్టారు. కాసులకు కక్కుర్తి పడి పనులు జరిగినప్పుడు అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో గుత్తేదారు తన ఇష్టానుసారంగా పనులు చేపట్టడంతో నాలుగు నెలలు పూర్తి కాకముందే రోడ్డు బీటలు వారింది. దీన్నిబట్టి అధికారుల పర్యవేక్షణ ఏ విధంగా ఉందో? పనుల్లో నాణ్యతా ప్రమాణాలు ఏ విధంగా ఉన్నాయో? వీటిని చూస్తేనే అర్థం చేసుకోవచ్చు. ప్రజాధనాన్ని కాపాడాల్సిన అధికారులే ప్రభుత్వ ఆదేశాలను పక్కనపెట్టి ఇష్టానుసారంగా నిర్మాణ పనులు చేపట్టడంతో రహదారి ఈ స్థితికి చేరుకుందని అధికారులపై స్థానికులు విమర్శలు గుప్పిస్తున్నారు. గత ఐదేళ్ల కాలంలో రహదారి మరమ్మతులు చేపట్టినప్పటికీ గుంతల రోడ్లో ప్రయాణించడం వల్ల నరకాన్ని చూశామన్నారు. ఆ స్థితి రాకముందే నాణ్యతతో కూడిన రహదారులు నిర్మాణ పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

దశమంతపురం - పెద్దబుడ్డిడి రోడ్డు పూర్తిచేయాలి

ప్రజాశక్తి - వీరఘట్టం



దశమంతపురంలో గ్రామస్తులతో కలిసి నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు ఇందిర, తదితరులు

మండలంలోని దశమంతపురం నుంచి జియ్యమ్మవలస మండలం పెద్దబుడ్డిడి గ్రామాల మధ్య గల రోడ్డును పూర్తిచేయాలని సిపిఎం డిమాండ్ చేసింది. ఈ మేరకు మండలంలోని అసంపూర్తిగా ఉన్న రహదారి వద్ద దశమంతపురం గ్రామస్తులతో శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఇందిరా, మండల నాయకులు ఎన్.సింహాచలం మాట్లాడుతూ వీరఘట్టం, జియ్యమ్మవలస మండలాల శివారు గ్రామాలైన దశమంతపురం, పెద్దబుడ్డిడి గ్రామాల మధ్య సుమారు మూడు కిలోమీటర్ల రహదారిని పూర్తి చేయకపోవడంతో రైతులు, ప్రయాణికులు, చిరువ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. వర్షాకాలం వస్తే కనీసం నడవడానికి కూడా ఇబ్బంది పడే పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ రహదారి పూర్తి అయితే ప్రత్యక్షంగా 5000 మందికి, పరోక్షంగా 10,000 మందికి రవాణా సౌకర్యం కలుగుతుందన్నారు. చుట్టుపక్కల ఉన్న గ్రామాల రైతులు పంటలు రవాణా చేసుకోవచ్చుని, ఈ గ్రామాల మధ్య వ్యాపారం జరిగి ప్రజలకు మేలు కలుగుతుందని వారన్నారు. గతంలో శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల పరిధిలో ఈ రెండు గ్రామాలుండేవని, దీంతో ఏ విధమైన అభివృద్ధికి నోచుకోలేదని అన్నారు. పాలకొండ, కురుపాం ఎమ్మెల్యేలు కూడా ఈ గ్రామాల అభివృద్ధిని పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఇప్పుడు పార్వతీపురం మన్యం జిల్లాగా ఏర్పడిందని, జిల్లా నుంచి ప్రతి పంచాయతీకి అందుబాటులో ఉన్న లింకు రోడ్లు కలిపి రోడ్లు వేసి రవాణా సౌకర్యం కల్పించి సమగ్ర అభివృద్ధి ప్రణాళికలు రూపొందించుకొని, ప్రతి పంచాయతీకి బస్సు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అధికారులు, నాయకుల నిర్లక్ష్యం వల్ల రహదారి పూర్తి కాలేదన్నారు. ఇప్పటికైనా సంబంధించిన అధికారులు స్పందించి రహదారిని పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రెండు గ్రామాల ప్రజలను సమీకరించి కలెక్టరేట్ వద్ద ధర్నా చేసి రహదారి పూర్తయ్యేంత వరకు పోరాటం చేస్తామని వారన్నారు. కార్యక్రమంలో ఇరు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.